



అదరగొట్టిన శివమణి

చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం రాత్రి 'మోహన మంత్ర'లో భాగంగా నిర్వహించిన డీజే కార్యక్రమం అదరగొట్టింది. డ్రమ్స్ శివమణి తన సంగీతంతో విద్యార్థులను ఉర్రూతలూగించారు.

ఎస్వీయూకు మొదటి స్థానమే లక్ష్యం

- వీసీగా బాధ్యతలు స్వీకరించిన నరసింగరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీని మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యమని నూతన వీసీ నరసింగరావు పేర్కొన్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ వీసీ పదవి దక్కడం పూర్వజన్మ సుకృతమన్నారు. బొబ్బిలి సమీప గ్రామం నుంచి వచ్చిన తాను బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ చేశానన్నారు. ప్రొఫెసర్‌గా, పాలనారంగంలో పనిచేసిన అనుభవంతో ఎస్వీయూ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవితఖైదు

సూళ్లూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 2019 నాటి గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. సూళ్లూరుపేట బొగ్గుల కాలనీకి చెందిన తిరువళ్లూరు నవీన్‌కుమార్, సాయినగర్‌కు చెందిన కేకుల దేవకు జీవిత ఖైదుతో పాటు నగదు దోపిడీకి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు ప్రేమించుకుంటున్నారు. 2019 ఫిబ్రవరి 3న రాత్రి 10.30 గంటల సమయంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ చివర్లో కూర్చొని వీరు పెళ్లి విషయమై మాట్లాడుకొంటున్నారు. అదే సమయంలో నలుగురు యువకులు అతడిపై దాడిచేసి నగదు లాక్కున్నారు. ఆ యువతిని కాస్త దూరం లాక్కెళ్లి గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. మళ్లీ ఆమెను తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసి పరారయ్యారు.అప్పట్లో ఈ గ్యాంగ్ రేప్ సూళ్లూరుపేటలో సంచలనం రేపింది. అప్పటి సీఐ కిషోర్ బాబు,పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ మురళీకృష్ణ, కోర్ట్ లైజన్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కే ఖాజాహుస్సేన్ సాక్ష్యాలను సరైన సమయంలో సమర్పించి నేరం రుజువు కావడానికి కృషి చేశారు. ప్రాసిక్యూషన్ తరపున తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫీ మాలిక్ వాదనలు వినిపించారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.



మానవ మృగాలకు సరైన శిక్షే పడింది

ఆరేళ్ల కిందట గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ఇద్దరికి జీవిత ఖైదు శిక్ష పడడంతో 'మానవ మృగాలకు సరైన శిక్షే పడింది' అని స్థానికులు అంటున్నారు. బాధితురాలికి కొంతవరకు న్యాయం జరిగిందని చర్చించుకున్నారు. ప్రియుడి కళ్లెదుటే అత్యాచారానికి పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో అప్పట్లో మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. ఈ ఘటనను నిరసిస్తూ ఒక ఉద్యమం నడిచింది. పోలీసులూ రంగంలోకి దిగి మరుసటి రోజే నిందితులను పట్టుకున్నారు. అప్పటి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి వచ్చి బాధిరాలిని పరామర్శించారు. మానవ మృగాలకు త్వరగా శిక్షపడేలా చూస్తామన్నారు. ఈ ఘటనతో అప్పటి సీఐ కిషోర్ బాబు, ఎస్‌ఐ విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నలుమూలల నుంచి సూళ్లూరుపేటకు పోలీసులు, స్పెషల్ ఐడిపార్టీ రప్పించి పరిశ్రమలు, బాలికల పాఠశాల, హాస్టల్స్ రైల్వేస్టేషన్ సమీపాల్లో పోలీసుల గస్తీ పెంచారు. దాదాపు రెండు నెలల పాటు ఈ ప్రాంతంలో పోలీసు గస్తీ ఉంది. ఈ క్రమంలో ఇద్దరికి జీవత ఖైదు పడటంతో సరైన శిక్షే పడిందని అంటున్నారు.



నిరీక్షించి.. నీరసించి..!

- షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్
- పూర్తి స్థాయిలో చూపని ఖాళీల జాబితా
- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో కొత్త టీచర్ల అవస్థలు

తిరుపతి (విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్‌తో గంటలకొద్దీ నిరీక్షిస్తూ కొత్త టీచర్లు ఇబ్బంది పడ్డారు. ఇందులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమూ కనిపిస్తోంది. మెగా డీఎస్సీ కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన 1403 మంది టీచర్లలో 1394 మంది చిత్తూరు, తిరుపతి, గూడూరులోని ఆరు కేంద్రాల్లో ఎనిమిది రోజుల పాటు.. అక్కడే ఉండి శుక్రవారంతో శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ కాలంలోనే చివరి రెండు రోజులు వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి, వీరికి పోస్టింగులు కేటాయించాలి. దీనికిగాను ఎస్టీటీలకు గురువారం మధ్యాహ్నం 3 నుంచి మాన్యువల్, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో మాత్రం దీనికి భిన్నంగా జరగడం.. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఎందుకంటే.. తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్‌లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లను తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు పూర్తి చేశారు. కౌన్సెలింగ్ నిర్వహణకు లాగిన్ అధికారమున్న చిత్తూరు డీఈవో వరలక్ష్మి వివిధ కారణాలతో రాత్రి 10.30 గంటలకు వచ్చారు. దీంతో అర్ధరాత్రి 11 గంటల తర్వాత మొదలై.. శుక్రవారం వేకువ జాము 4 గంటలకు వరకు 250 మందికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన వారికి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు తిరుపతి రూరల్ ప్రాంతంలోని మెడ్‌జీ స్కూల్లో 450 మందికి కౌన్సెలింగ్ ప్రారంభించాలి. కానీ, 4.30 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలు పెట్టి రాత్రి పది గంటలకు కౌన్సెలింగ్ పూర్తయింది. ఇక, గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో 175 మంది ఎస్టీటీలకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్లకు మూడు గంటలు ఆలస్యంగా.. సాయంత్రం 6 గంటలకు మొదలైన వెబ్ కౌన్సెలింగ్ రాత్రి 11.30 గంటల వరకు కొనసాగింది. ఇలా షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ జరగకపోవడానికి సాంకేతిక సమస్యలూ కారణమని అధికారులు చెబుతుండటం గమనార్హం.

ఒత్తిడికి గురై పడిపోయిన చిత్తూరు డీఈవో

చిత్తూరు సెంట్రల్/తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: ఎస్టీటీలకు స్థానాల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియలో ఒత్తిడికి గురైన చిత్తూరు డీఈవో వరలక్ష్మి.. శుక్రవారం మధ్యాహ్నం గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో మెట్లు ఎక్కుతూ పడిపోయారు. ఈ కాలేజీలో 175 మంది ఎస్టీటీ (తమిళం, ఉర్దూ ల్యాంగ్వేజస్)లకు ఉదయం 8.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కావాలి. డీఈవో సకాలంలో వెళ్లకపోవడం, సాంకేతిక కారణాలతో రాష్ట్ర ఐటీ సెల్ నుంచి టీచర్ల కేటాయింపు స్థానాలు డిస్ప్లే కాలేదు. దీంతో మధ్యాహ్నం వరకు మొదలు కాలేదు. దీనిపై విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు ఆర్జేడీపై.. కడప నుంచి ఆయనతోపాటు కమిషనరేట్ అధికారులూ డీఈవో వరలక్ష్మిపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఆ కళాశాల ప్రాంగణంలో ఒక చోట మెట్టు ఎక్కబోతూ డీఈవో ఉన్నపాటున పడిపోయారు. సిబ్బంది హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించి స్కానింగ్ చేయించారు. ప్రాథమిక వైద్యం అందించగా, డీఈవో కోలుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత కౌన్సెలింగ్‌ను మొదలుపెట్టి సాయంత్రం ఆరు గంటలకు పూర్తి చేశారు.

ఖాళీలు చూపడంలోనూ స్పష్టత కరువు

ఉమ్మడి జిల్లాలోని టీచర్ పోస్టుల ఖాళీలను పూర్తిగా చూపలేదు. హెచ్ఆర్ఏ 16శాతం, 12 శాతం వచ్చే రెండు కేటగిరిల్లో (కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో) 500 ఖాళీలను బ్లాక్ చేశారు. వీటిల్లోనే టీచర్ పోస్టుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. నగరాలు, పట్టణాల్లో కనీసం 400 ఖాళీలైనా కొత్త టీచర్లతో భర్తీ చేసుంటే ఈ ప్రాంత విద్యార్థులకు కొంతవరకైనా న్యాయం జరిగేది. అలా కాకుండా కొత్త టీచర్లందరినీ మూడు నాలుగు హెచ్ఆర్ఏ కేటగిరి పరిధిలోకి వచ్చే మండల స్థాయిలోని గ్రామీణ పాఠశాలలకే పరిమితం చేశారు. ఈ ఖాళీలు మాత్రమే జాబితాలో చూపారు.

స్థానాల జాబితాలో తారుమారు

కౌన్సెలింగ్ పక్రియలో సర్వర్లు బిజీగా ఉండటంతో కౌన్సెలింగ్ ఆలస్యానికి మరో కారణంగా తెలుస్తోంది. మరో వైపు కొన్ని ప్రాంతాల ఖాళీలు తప్పుగా నమోదు కావడం,వాటిని సవరించేందుకు సాంకేతిక సిబ్బంది సమయం తీసుకోవడంతో ఇటు విద్యాశాఖ అధికారులు, అటు కొత్త టీచర్లు తలలు పట్టుకున్నారు. ఖాళీలను ప్రచురించిన జాబితాలో పారదర్శకత లేకపోవడంతోనూ కొత్త టీచర్లు విస్తుపోతున్నారు.

విషాదం నింపిన అతివేగం

- గరుడవారధిపై నుంచి పడి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై అతివేగంతో వచ్చిన ఇద్దరు యువకులు.. అదుపు తప్పి తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి పడి దుర్మరణం చెందారు. ఈస్ట్ ఎస్‌ఐ హేమాద్రి కథనం మేరకు.. చంద్రగిరి మండలం కందులవారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్ నాయుడి ఏకైక కుమారుడు కనిష్క(22), ఇతడి స్నేహితుడు, కొటాలకు చెందిన వాచువా కొమ్మినేని(23) చంద్రగిరి మండంలోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నారు. వీరిద్దరూ శుక్రవారం మధ్యాహ్నం చంద్రగిరి నుంచి బుల్లెట్‌లో బయలుదేరి.. మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. అతివేగంగా వస్తున్న వీరు లక్ష్మీపురం సర్కిల్ వద్ద అదుపు తప్పి



కనిష్క వాచువా కొమ్మినేని (ఫైల్ ఫొటోలు)

ఎడమ వైపు వున్న గ్రిల్ డివైడర్‌ను ఢీ కొన్నారు. దాదాపు రెండు అడుగుల ఎత్తు ఎగిరి వారధిపైనుంచి దాదాపు 30 అడుగుల కింద రోడ్డుపై పడ్డారు. ఒకరు వినాయకస్వామి గుడి వద్ద, మరొకరు పెట్రోలు బంకు వద్ద పడి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో ఈస్ట్ ఎస్‌ఐ హేమాద్రి, ఏఎస్‌ఐ అశోక్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 108లో మృత దేహాలను రుయా స్పత్రికి తరలించారు.కనిష్క బావ సురేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు. బుల్లెట్‌ను పోలీసులు సీజ్ చేశారు. రుయా అత్యవసర విభాగం వద్ద ఇద్దరు కుటుంబీకులు, బంధువులు, తోటి విద్యార్థుల రోదనలు అందరినీ కలచివేసింది.

తిరుపతిలో ఒబెరాయ్ రిసార్ట్‌కు 20 ఎకరాలు

నాయుడుపేటలో కార్బన్ బ్లాక్ పెట్టుబడి సవరణ

పర్యాటక, పరిశ్రమల శాఖల ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం

తిరుపతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఒబెరాయ్ విల్లాస్ రిసార్ట్‌కు 20 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాయుడుపేట సెజ్‌లో ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ ప్రతిపాదించిన పెట్టుబడిని తగ్గించుకునేందుకూ అంగీకరించింది. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 32వ ఇ-క్యాబినెట్ సమావేశంలో జిల్లాకు సంబంధించి నిర్ణయాలు తీసుకున్నారు. తిరుపతిలోని అలిపిరి-చెర్లోపల్లి రోడ్డుకు ఉత్తరంగా ఒబెరాయ్ సంస్థకు గత ప్రభుత్వం 20 ఎకరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ సంస్థ ప్రతినిధులు తమ గ్రూపుల్లో ఒకటైన ముంతాజ్ హోటల్స్ పేరిట బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో హిందూయేతర సంస్థగా భావించిన పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దీన్ని వ్యతిరేకించారు. ఒబెరాయ్‌కు భూ కేటాయింపులు రద్దు చేసి.. ఆ భూమిని టీటీడీకి అప్పగించాలని కోరుతూ పాలకమండలి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించారు. ఈ క్రమంలో తిరుమలకు వచ్చిన సీఎం చంద్రబాబు ఆ భూ కేటాయింపులు రద్దు చేసి, ఆ సంస్థకు మరోచోట భూములు కేటాయిస్తామని ప్రకటించారు. ఆ ప్రకారం సర్వే నంబరు 588-ఏలో 20 ఎకరాలకు ఒబెరాయ్‌కు చెందిన ట్రైడెంట్ గ్రూప్ పేరిట కేటాయించడానికి మంత్రిమండలి ఆమోదించింది.

- నాయుడుపేట సెజ్‌లో రూ. 3,718 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటూ మెస్సర్స్ ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనికి 116.62 ఎకరాలను కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇటీవల ఆ సంస్థ తమ పెట్టుబడిని రూ.2,717 కోట్లకు తగ్గించుకుంటామంటూ ప్రతిపాదనలు పంపగా.. దానికనుగుణంగా ఇతర మినహాయింపులు, రాయితీలలో కూడా సవరణలను మంత్రివర్గం ఆమోదించింది.

కొడుకునైనా కాపాడుకోగలిగాం



విమానం నుంచి గుండెను తీసుకొస్తూ..

వారిది సత్యవేడు ప్రాంతం. నిరుపేద కుటుంబం. వీరి పెద్ద కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ కొద్ది రోజుల కిందటే మృతిచెందింది. మరోవైపు 14 ఏళ్ల కొడుకూ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కనీసం కొడుకునైనా కాపాడుకోవాలని ఆ తల్లిదండ్రులు తపన పడ్డారు. ఆ బాలుడిని నెల రోజులుగా ఆస్పత్రిలోనే ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇతడికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించి వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్లో నమోదు చేశారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన పి.విజయకృష్ణ(28) రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురై అవయవదానానికి సిద్ధంగా ఉన్నారనే విషయం తెలిసింది. తిరుపతి నుంచి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి బృందంతో వెళ్లి గ్రీన్ ఛానల్ ద్వారా విమానంలో.. ఎయిర్‌పోర్టు నుంచి అంబులెన్సులో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయకు గుండెను తీసుకొచ్చారు. దాదాపు 6 గంటలు శ్రమించి గుండె మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు. హమ్మయ్య.. కొడుకునైనా రక్షించుకోగలిగామని ఆ తల్లిదండ్రులు ఊరట చెందారు. ఈ శస్త్రచికిత్సతో ఇప్పటి వరకు 21 విజయవంతంగా పూర్తి చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మరోవారంలో కొలువుదీరనున్న ముక్కంటి ఆలయ బోర్డు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు మారో వారం రోజుల్లో కొలువుదీరనుంది. ఇటీవల ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యుల పేర్లను కూటమి ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు శుక్రవారం అధికారిక జీవోను విడుదల చేశారు. దీంతో మండలి నియామకం ఖరారు అయింది. చైర్మన్‌గా కొట్టే సాయిప్రసాద్‌తో పాటు 16మంది సభ్యులు బీల స్రవంతి, చిన్నపూల లక్ష్మీనారాయణ, లక్ష్మమ్మ, జి.గోపీనాథ్, కె.కుసుమ కుమారి, కొమ్మబోయిన రజని, నాగరాజు కొప్పెర్ల, పెనగలూరు హేమవతి, విజయమ్మ, రుద్రాక్షల కౌసల్యమ్మ, దండి రాఘవయ్య, పగడాల మురళి, వి.గురప్పశెట్టి, కోల విశాలాక్షి, ప్రకాష్‌రెడ్డి, కాలే సావిత్రి ఉన్నారు.

రావమ్మా వరలక్ష్మీ...

● అమ్మవారికి వేడుకగా ఊంజల్ సేవ



ఊంజల్‌పై అమ్మవారు - సంకీర్తనలు ఆలపిస్తున్న శోభారాజ్

తిరుచానూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని రావమ్మా వరలక్ష్మీ... కావంగా మాలక్ష్మి అంటూ కీర్తిస్తూ డాక్టర్ శోభారాజ్ ఊంజల్‌సేవలో ఆలపించారు. అమ్మవారి ఆస్థాన మండపంలో శుక్రవారం అన్నమయ్య సంకీర్తనా గానం మధురంగా సాగింది. అనంతరం ఆలయ వేదపండితులు ఆమెను ఆశీర్వదించారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా రాత్రి అమ్మవారికి వేడుకగా బంగారు తిరుచ్చి ఉత్సవం జరిగింది.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ బి.కృష్ణమోహన్

తిరుచానూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో వెలసి ఉన్న పద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ఆలయంలోని ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై గ్రీన్ రిబ్బన్ ర్యాలీ



గ్రీన్ రిబ్బన్ ర్యాలీ నిర్వహిస్తున్న మొగరాల జడ్పీహైస్కూల్ విద్యార్థులు

పాకాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మొగరాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం మానసిక ఆరోగ్యంపై గ్రీన్ రిబ్బన్ ర్యాలీ నిర్వహించారు. టీచర్ కౌన్సిలర్ వి.వెంకటసిద్దులు ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యాన్ని పెంచడానికి దోహదపడే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాలల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని మానసిన ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యానికి జీవన శైలిలో మార్పులకోసం ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, స్నేహపూర్వక మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు సుల్తాన్, బాబు, రామ్మూర్తి, నీరజ, ప్రమోదిని, సీఆర్పీ మునికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ఆర్‌జీకాలనీ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఏడుకొండలు తెలిపారు. మానసిక ఆరోగ్యం ఆవశ్యకతను వివరించారు. హెచ్ఎం రవీంద్రయ్య, డాక్టర్ శిరీష, టీచర్లు పాల్గొన్నారు.

వెదురు సాగు లాభదాయకం



వెదురు మొక్కలను రైతులకు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు

భాకరాపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వెదురు సాగు లాభదాయకమని డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు అన్నారు. చిన్నగొట్టిగల్లులో వెదురుసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వేరుశనగ, టమోటా వంటి సాంప్రదాయక పంటలు అధికంగా వేయడం వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారన్నారు. వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపి వెదురు సాగు చేయడం వల్ల మంచి ఆదాయం లభిస్తుందన్నారు. వెదురు మూడు సంవత్సరాలకు కోతకు వస్తుందని, కేవలం 30 సెంట్ల భూమి ఉన్న రైతుకు వెదురు సాగుకు అనుమతులు ఇస్తామన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో 85 మంది రైతులకు వెదురు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, డీపీఎం వెంకటేశు, ఏపీఎంలు స్వర్ణలత, దాక్షాయణి, ఇండస్ట్రీ ఎన్‌జీవో కుసుమ, సీసీ శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

సిద్దార్థ విద్యార్థులు 8మంది ఉద్యోగాలకు ఎంపిక



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతిరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఎకో బ్రెయిన్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫైనలియర్ విద్యార్థులు 8మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్ పేర్కొన్నారు. వీరికి నియామకపత్రాలు అందజేశారు. విద్యార్థులను ఛైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథన్, టీపీవో భాస్కర్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

నేడు వెటర్నరీలో ధన్‌ధాన్య యోజన ప్రత్యక్ష ప్రసారం

తిరుపతిరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీలోని వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో శనివారం ఉదయం 10గంటల నుంచి ధన్‌ధాన్య యోజన లైవ్ ప్రసార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.వినూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతుసంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ధన్‌ధాన్య యోజన, 2025-26 బడ్జెట్‌లో ప్రకటించిన పప్పుధాన్యాల మిషన్‌పై ప్రధాని నరేంద్రమోదీ రైతులనుద్దేశించి మాట్లాడనున్నారని తెలిపారు. ఈ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయడం, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, రైతులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వర్సిటీ శాస్త్రవేత్తలు, అధికారులు, సంబంధిత సిబ్బంది హాజరవుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ఆర్టీసీ ఎండీ



ద్వారకా తిరుమలరావు

తిరుమల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము ఆలయంలో జరిగిన అభిషేక సేవలో పాల్గొని మూలవిరాట్టును దర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

కనకదుర్గమ్మ ఆలయంలో అన్నదానం ప్రారంభం



అన్నదానం చేస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలిసిన కనకదుర్గమ్మ (వస్కోటు ఎల్లమ్మ) ఆలయంలో గ్రామస్తులు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు అమ్మవారికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీవారి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రతి శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారాయల్, నేతలు పూల సురేష్, నిరంజన్, వేణుగోపాల్‌రెడ్డి, కుమార్, సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాస్, మహేష్, చంద్రిక, మంజుల, భానుప్రియ, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

పాకాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సుదర్శన ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలన్నారు. జనావాసాలకు దూరంగా నిలువ ఉంచుకోవాలని, భద్రతాపరమైన సూచనలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వ వుంచడం, రవాణా చేయడం నేరమన్నారు. మండల పరిధిలో నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేస్తున్నా, నిలువ వుంచినా సమాచారం అందించాలని ఆయన కోరారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

● పరారైన నిర్వాహకురాలు, ముగ్గురి అరెస్టు

తిరుచానూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీసుస్టేషన్‌పరిధిలోని పద్మావతిపురంలో నిర్వహిస్తున్న వ్యభిచారగృహంపై పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు విటులతో పాటు మరో ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ కథనం మేరకు.. జ్యోతి అనే మహిళ పద్మావతిపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బయట ప్రాంతాల నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తోంది. స్థానికుల సమాచారంతో పోలీసులు వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించారు. ముబారక్‌బాషా, కుమార్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి యువతులను రప్పిస్తున్న దుర్గాప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం అరెస్టుచేశారు. వ్యభిచార గృహ నిర్వాహకురాలు జ్యోతి పరారీలో ఉనట్లు సీఐ తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు

పాకాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర గుప్తా శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. పనులను పరిశీలించి, నాణ్యత పాటించాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వసతి సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్‌లో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

ఎస్వీయూ నూతన వీసీకి అభినందన



వీసీ నర్సింగరావును సన్మానిస్తున్న తిప్పారెడ్డి, లక్ష్మీప్రశస్త

తిరుపతిరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ తాతా నర్సింగరావుని శుక్రవారం అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ బిజయ్‌కుమార్ బెహర, సెక్రటరీ లక్ష్మీప్రశస్త తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఎన్డీయే



చంద్రగిరిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చంద్రగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో ఎన్డీఏ ప్రభుత్వం గద్దెనెక్కి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఐరాల లోకేష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్.. గద్ది చోడ్ (ఓటు దొంగ.. గద్దె దిగు) అనే నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువను తెలియపరుస్తూ, దొంగ ఓట్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు నిరసిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించటానికి నిత్యం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న అధికారులు నిజమైన ఓటర్లతో జాబితాను తయారుచేసి ప్రజాస్వామ్యానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. లేదంటే ప్రజాక్షేత్రంలో ఎన్డీయేకి ఓటమి తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణస్వామి, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు జ్యోతీశ్వర్ నాయక్, శివ బాలాజీ, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని

ఆర్వో వాటర్‌ప్లాంట్లు



బీరామాకుల కండ్రిగలో ప్రారంభానికి నోచుకోని ఆర్వో వాటర్‌ప్లాంట్

రామచంద్రాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శుద్ధజలాన్ని ప్రజలకు అందించేందుకు లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్‌ప్లాంట్లు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మండలంలో తుడా నిధులతో 14, పంచాయతీరాజ్ నిధులతో 8 ఆర్వో వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి రూ.6.80లక్షలుచొప్పున ఖర్చుచేశారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు ఆర్వోవాటర్‌ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టారు. తరువాత 15 వాటర్ ప్లాంట్లు ప్రారంభానికి నోచుకోగా.. అనుపల్లి, బీరమాకులకండ్రిగ, పుల్లమనాయుడుకండ్రిగ, మోటావారికండ్రిగ, పూనేపల్లి గ్రామాల్లో వివిధ కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు. మూడేళ్లుగా లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్‌ప్లాంట్ల ద్వారా శుద్ధజలాన్ని పేదలకు అందించలేకపోయారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన వీటిని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక వికాసం



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



మాట్లాడుతున్న హెచ్ఎం హరినాథరెడ్డి

తిరుపతి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా దేహ దారుఢ్యంతోపాటు మానసిక వికాసం సాధించవచ్చని ఎంఆర్‌పల్లె జెడ్పీహైస్కూల్ హెచ్ఎం హరినాథరెడ్డి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం తిరుపతి డివిజన్ పరిధిలో 9 మండలాలకు చెందిన విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పలువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు భార్గవి, కిశోర్, పీడీల సంఘ కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, విద్యాలత, హిమబిందు, టీచర్లు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు చూపండి

● ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా



తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు చూపాలని సీపీఎం నాయకులు వి.నాగరాజు, కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ శెట్టిపల్లి పంచాయతీలో 2,740 మంది అర్హులైన పేదలు ఉన్నారని గత ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. ఇంటి పట్టాలు ఇచ్చారేగాని స్థలాలు చూపలేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి రెండు సెంట్లు ఇంటి స్థలాలుగా పంపిణీ చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రకటించారని, ఆ మేరకు ఇవ్వాలని కోరారు. తుడా క్వార్టర్స్ సమీపంలో సర్వే నెంబర్లు 195-2, 195-4లో 41 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో మంజూరు చేయాలని కోరారు. పేదలకు న్యాయం జరిగే పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, మాధవ్, బుజ్జి, నరేంద్ర, జయంతి పాల్గొన్నారు.

ముగిసిన వృత్తి శిక్షణ

● ఉమ్మడి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో తరగతులు

● తర్ఫీదు పొందిన 1,394 మంది కొత్త ఉపాధ్యాయులు



శిక్షణ పూర్తిచేసుకున్న ట్రైనీ ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి వృత్తిపరమైన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. దసరా పండుగ రోజున ప్రారంభమైన శిక్షణ తరగతులు తొమ్మిది రోజులపాటు సాగాయి. ఆరు కేంద్రాల్లో రెసిడెన్షియల్ విధానంలో తరగతులు నిర్వహించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి తిరుపతి రూరల్ దుర్గసముద్రం మెడ్‌జీ స్కూల్‌లో 450 మంది ఎస్జీటీలకు, తిరుపతి రూరల్ వేదాంతపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 213 మంది ఫిజికల్‌సైన్స్, మైనర్ మీడియంలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకు తరగతులు నిర్వహించారు. తిరుపతి జీవకోన విశ్వంనగర్‌లోని విశ్వం పాఠశాలలో 250 ఎస్జీటీలకు, గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో 222 మంది ఎస్జీటీలకు మొత్తం 1,135 మందికి శిక్షణ ఇచ్చారు. ఇక చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరులో శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో భాషా శాస్త్రాలకు చెందిన 152 మంది స్కూల్ అసిస్టెంట్లకు, ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో గణితం, బయాలజీ, సోషల్, ఫిజికల్ సైన్స్‌కు చెందిన 160 మంది స్కూల్ అసిస్టెంట్లు శిక్షణ పొందారు. వీరిలో వివిధ కారణాలతో 9 మంది హాజరు కాలేదు.

ప్రశాంతంగా నిర్వహించాం

ఉపాధ్యాయులకు శిక్షణ అన్ని కేంద్రాల్లో సవ్యంగా సాగింది. విద్యార్థులకు సులభంగా, ఉత్తమంగా బోధించేలా వారికి శిక్షణ ఇచ్చాం. నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లు వారికి పలు అంశాలను వివరించారు. అవసరమైన భోజన, వసతి, వైద్యం ఏర్పాటు చేశాం. అభ్యసన సామగ్రి అందజేశాం.

- కోట వెంకట నాగేంద్రకుమార్, డీఈవో, తిరుపతి జిల్లా

రెండు ఏనుగులకు

రేడియో కాలరింగ్ బెల్ట్

అటవీశాఖ అధికారుల యత్నం



దామలచెరువు బీట్‌లో గజసంచార ప్రాంతాలను పరిశీలిస్తున్న రాకేష్, అటవీ శాఖ అధికారులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగుల సంచారం అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కౌండిన్య అభయారణ్యంలో సంచరిస్తున్న రెండు ఏనుగులకు రేడియో కాలరింగ్ బెల్ట్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో పడ్డారు. నాలుగేళ్ల క్రితం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో ఎంపిక చేసిన ఏనుగులకు దీన్ని ఏర్పాటు చేయాలని భావించినా, సాంకేతిక సమస్యల కారణంగా వీలు కాలేదు.ఈ నేపథ్యంలో వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ శుక్రవారం చిత్తూరు ఈస్టు, వెస్టు, పనపాకం ప్రాంతాల్లోని ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు, ఎఫ్ఎస్ఓలు, ఓఫ్‌బీవోలు, 14 మంది ఎలిఫెంట్ ట్రాకర్లతో కలిసి దామలచెరువు బీట్‌లో ఏనుగుల సంచార ప్రాంతాలను పరిశీలించారు. గురువారం పలమనేరు ప్రాంతంలోనూ పరిశీలించారు. పలమనేరు ప్రాంతంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగుతో పాటు పులిచెర్ల, దామలచెరువు, కల్లూరు ప్రాంతాల్లో తరచూ సంచరిస్తున్న ఏనుగుల గుంపులో ఒక ఏనుగుకు రేడియో కాలరింగ్ బెల్ట్ అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ బెల్ట్ ద్వారా జీయో ట్రాకింగ్ సిస్టమ్‌ను ఆయా అటవీ పరిసర ప్రాంతాల ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు, ఎఫ్ఎస్‌ఓల మొబైల్స్‌కు అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా ఏనుగులు ఏ సమయంలో ఏ ప్రాంతంలో సంచరిస్తున్నాయి, ఎక్కడ ప్రమాదం పొంచి ఉందనే విషయాలను పసిగట్టే వీలుంది.దీంతో ఆయా ప్రాంతాల్లోని అటవీ సిబ్బందిని, ఎలిఫెంట్ ట్రాకర్లను అప్రమత్తం చేస్తారు. వారు వెంటనే ప్రాంతానికి చేరుకుని, ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రయత్నం చేస్తారు.

నేడు మామిడి రైతులకు సబ్సిడీ జమ

● రూ.183 కోట్లను జమ చేయనున్న ప్రభుత్వం

చిత్తూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మామిడి రైతులకు అందాల్సిన సుమారు రూ.183 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం శనివారం విడుదల చేయనుంది.గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న తోతాపురి రకం మామిడి రైతులకు సీఎం చంద్రబాబు కిలోకు రూ.4 మద్దతు ధరను ప్రకటించిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లాలో 3.73 లక్షలు, తిరుపతిలో 66 వేల టన్నుల కాయల్ని పరిశ్రమలు కొనుగోలు చేశాయి. ప్రభుత్వం మద్దతు ధరను రూ.12గా నిర్ణయించి, ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని, మిగతా రూ.4 ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుందని చెప్పినా ఫ్యాక్టరీలు పాటించలేదు. చివరి వారం మినహా సీజన్ మొత్తం రూ.6 మాత్రమే ఇచ్చాయి. ఆయా ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద ప్రభుత్వ ఉద్యోగుల బృందాలు విడతల వారీగా పనిచేసి మరీ రైతుల వివరాలను తీసుకున్నాయి. జూలై నెలలో సీజన్ ముగియగా, అప్పటి నుంచి రైతులు సబ్సిడీ కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు నెల రోజుల పాటు వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది సహకారంతో ఆయా రైతుల వివరాలను మరోసారి క్రాస్‌చెక్ చేయించారు. ఫైనల్ జాబితాలను తయారుచేసి అప్లోడ్ చేసిన నెల తర్వాత నిధులు విడుదల చేస్తున్నారు.చిత్తూరు జిల్లాలో సుమారు 40 వేల మంది రైతులకు రూ.148 కోట్లు, మిగిలిన అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు రూ.35 కోట్లు చొప్పున సబ్సిడీ జమ కానుంది.

తిరుమలకు ప్రత్యామ్నాయ విద్యుత్‌పై సర్వే



నామాల కొండ వద్ద విద్యుత్ లైన్లు పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు విద్యుత్ సరఫరా చేయడానికి ఎస్పీడీసీఎల్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. గతంలో అలిపిరి సబ్‌స్టేషన్ 33 - 11కేవీ నుంచి సరఫరా చేసేవారు. ప్రస్తుతం శ్రీవారిమెట్టు మార్గంలో సరఫరా రెడీ కావడంతో దాన్ని తాత్కాలికంగా ఆపేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో అలిపిరి నుంచి కూడా సరఫరా చేయడానికి సాధ్యాసాధ్యాలను శుక్రవారం విద్యుత్ తిరుపతి టౌన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. తిరుమల నుంచి మూడునామాల కొండ వరకు పరిశీలించారు. డిప్యూటీ ఈఈ జయప్రకాష్, ఏఈ వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు దేవళంపేటకు హోం మంత్రి అనిత

వెదురుకుప్పం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):హోం మంత్రి అనిత శనివారం ఉదయం 10 గంటలకు వెదురుకుప్పం మండలం దేవళంపేట రానున్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చిన ఘటనతో ఇటీవల దేవళంపేట వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే.ఈ ఘటన స్థలాన్ని పరిశీలించడానికి హోం మంత్రి పలువురు ఎమ్మెల్యేలతో కలిసి వస్తున్నారని ఎమ్మెల్యే వీఎం థామస్ తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఎంఎస్‌రాజు,విజయశ్రీ, మురళీమోహన్, పాశం సునీల్‌కుమార్, ఆదిమూలంతో పాటు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దేవళంపేటకు వస్తున్నారని ఆయన తెలిపారు.ఇక్కడ ఏర్పాటు చేసే సభలో ప్రజలను ద్దేశించి మాట్లాడతారన్నారు.

బంగారుపాళ్యం రైతుకు జాతీయస్థాయి గుర్తింపు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం దండువారిపల్లెకు చెందిన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు వై.జగదీశ్వర్‌రెడ్డికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రధానమంత్రి ధన-ధాన్య యోజన (పీఎండీడీవై) కింద దేశ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ రైతుల విభాగంలో చిత్తూరు జిల్లా రైతుకు స్థానం లభించింది.

ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు పతకాల పంట


ప్రతిభచాటిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ జూడో, కరాటే, తైక్వాండో టోర్నమెంట్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులు సత్తా చాటారు. శుక్రవారం జరిగిన పోటీల్లో ఏడు బంగారు, పది సిల్వర్ పతకాలు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వై.మల్లికార్జునరావు, వైస్ ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ముస్తాక్‌అహ్మద్ విద్యార్థులను అభినందించారు.

గర్భిణులకు పోషకాహార కిట్లు


కిట్స్ అందజేస్తున్న దాత నీలిమారెడ్డి

తిరుపతి అర్బన్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 30మంది గర్భిణులకు 18 రకాల పోషకాహార కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఏకం యూఎస్‌ఏ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ నీలిమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కిట్లు అందజేశారు.ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారంతీసుకుని రక్తహీనత బారినపడకుండా చూసుకోవాల న్నారు. సిర్డ్ కార్యదర్శి మరుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఏటా 100మంది గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేస్తున్నామన్నారు.రేణిగుంట మండలం పద్మావతినగర్ ఏఎన్‌ఎం ఉషారాణి, శివగంగ, తేజోవతి, హరిబాబు, జహోరాబీ, సుమలత పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత


వృద్ధుల దినోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ భవన్‌లో శుక్రవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వయోవృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. వారి అనుభవాలు సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.శంకర్ మాట్లాడుతూ స్విమ్స్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక ఓపీ కేటాయించాలని కోరారు. తమ భవనం పక్కనున్న ఖాళీస్థలం కబ్జాకు గురైందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, హస్తకళాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పి.హరిప్రసాద్, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బాలకృష్ణనాయక్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్‌శెట్టి, కోశాధికారి మునికృష్ణ పాల్గొన్నారు.

తిరుపతి

గంగమ్మకు రూ.లక్ష విరాళం


చెక్కును ఆలయ చైర్మన్, ఈవోకు అందిస్తున్న దాతలు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తాతానగర్‌కు చెందిన కె.జ్యోతి, వాసునాయుడు రూ.లక్ష విరాళమిచ్చారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ పాలకమండలి చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, ఈవో జయకుమార్‌లకు శుక్రవారం అందించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, దర్శించుకున్నారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బాలాజీ రైల్వే డివిజన్ ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్‌కుమార్

తిరుపతి (జీవకోన), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని బాలాజీ డివిజన్ రైల్వేసాధన కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బాలాజీ డివిజన్‌గా ప్రకటించాలని 30 సంవత్సరాలుగా కోరుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. విశాఖను రైల్వేజోన్‌గా ప్రకటించారని, అదే తరహాలో అత్యధిక ఆదాయం సమకూరుతున్న తిరుపతిని కూడా గుర్తించాలని కోరారు.సమావేశంలో వేణుగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వైఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మేస్త్రీ ఆత్మహత్య


మృతిచెందిన కృష్ణ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవనగర్‌లో ఒక మేస్త్రీ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. మాధవనగర్‌కు చెందిన కృష్ణ(48) మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య అతనికి తెలియకుండానే పలువురి వద్ద అప్పులు చేసింది. ఈ విషయమై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పులు ఇచ్చిన వాళ్లు తరచూ వచ్చి వేధిస్తుం డటంతో జీవితంపై విరక్తి చెందిన కృష్ణ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేసి, కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

ప్రభుత్వానివి డైవర్షన్ పాలిటిక్స్ : వైసీపీ

తిరుపతి(జీవకోన), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసును డైవర్ట్ చేయడానికి ప్రభుత్వం దేవళంపేట ఘటనలో వైసీపీపై కుట్ర చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

సంకటహర చతుర్థి వేడుకలు


విశేషాలంకరణలో వినాయకుడు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నాగాలమ్మ ఆలయంలో కుంభాభిషేకం


కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోన రాజీవ్ గాంధీకాలనీ మార్గం శ్రీనగర్‌కాలనీ వద్ద వెలసిన నాగాలమ్మకు నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం వేదపండితులు కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లుపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మానసిక ఆరోగ్యంతోనే శారీరక దృఢత్వం


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే శారీరక దృఢత్వాన్ని పొందగలరని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అనవసర ఆలోచనలు, ఒత్తిడి మనిషిని మానసికంగా దెబ్బతీస్తాయన్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనే ప్రయత్నం చేయాలని సూచించారు. కొవిడ్ లాంటి పరిస్థితుల్లో అనవసర భయాల వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.మానసిక వైద్య విభాగాధిపతి పద్మావతి, మల్లికార్జున్, వైద్యులు మానస, కవిత, కౌన్సిలర్లు మురళి, రమణయ్య పాల్గొన్నారు. స్విమ్స్‌లో ఇదే కార్యక్రమాన్ని సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.డీన్ అలోక్‌సచన్, వైద్యులు దుర్గాంజలి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఆర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, గాలివీధి, మంచాలవీధి, త్యాగరాజనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, సింగాలగుంట, వరదరాజనగర్, రామచంద్రనగర్, ఎన్జీవో కాలనీ, కేటీ రోడ్డు, ఖాదీకాలనీ, సప్తగిరి నగర్, అలిపిరి రోడ్డు, రఘునాథరెడ్డి కాలనీ, ఎస్టీవీ నగర్, రాజీవ్‌నగర్, తిమ్మినాయుడు పాళెం, బీటీఆర్ నగర్, తిరుమలనగర్, పీడీ నగర్, ఆర్టీవో కార్యాలయ పరిసరాలు, వెంకటరెడ్డికాలనీ, గెస్ట్‌లైన్ డేస్, వినాయకసాగర్ పరిసరాలు, కేసీపేట, పాడిపేట, శ్రీనివాసపురం, పద్మావతీపురం, తిరుచానూరు, తోళప్పగార్డన్, వేదాంతపురం సమీప ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీమ్ వర్కుతోనే లక్ష్య సాధన

- అధికారుల సమన్వయంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం
- టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో సింఘాల్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలిసి టీమ్ వర్కు చేసినప్పుడే లక్ష్య సాధన సాధ్యమవుందని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పేర్కొన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతమైన నేపథ్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో శుక్రవారం టీటీడీ, అటవీశాఖ, అగ్నిమాపక శాఖ, జిల్లా పోలీసు, విజిలెన్సు తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. 'ఇప్పటి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయి. అయినా, ప్రస్తుతం చోటు చేసుకున్న లోటుపాట్లు, సమస్యలు, ఇంకా భక్తులకు కల్పించాల్సిన మెరుగైన సౌకర్యాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసుకోవాలి. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు డేటా రిలేటెడ్ స్కీమ్ తయారు చేసుకోవాలి' అని సూచించారు. జిల్లా పోలీసు శాఖ పరంగా అత్యాధునిక టెక్నాలజీతో నేరాలు, ఇతర ఘటనలు, జరగకుండా ఎస్పీ సుబ్బరాయుడు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. ఇందులో సీవీఎస్‌వో మురళీకృష్ణ, జేఈవో వీరబ్రహ్మం కృషి ప్రశంసనీయమన్నారు. సౌకర్యాలు, వసతి, గ్యాలరీల్లో అన్నప్రసాదం పంపిణీపై భక్తులు 100 శాతం సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన అన్ని సౌకర్యాలపై అధికారుల అభిప్రాయాలను తీసుకుని రాబోవు రోజుల్లో అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. రానున్న తిరుచానూరు బ్రహ్మోత్సవాలు విజయవంతానికి కృషి చేయాలని జేఈవో వీరబ్రహ్మం కోరారు. ఈ ఏడాది టెక్నాలజీ సేవలను బాగా సద్వినియోగం చేసుకున్నామని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. కమాండ్ కంట్రోలు నుంచి ఎప్పటికప్పుడు సమీక్షించుకుని తిరుమల, తిరుపతిలో పార్కింగ్ సమస్య లేకుండా చూశామన్నారు. సోషల్ మీడియా, సైబర్ వింగ్ చాలా అప్రమత్తంగా పనిచేశాయన్నారు. టీటీడీ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు అభినందించడం ఆనందం వేసిందని సీవీఎస్‌వో మురళీకృష్ణ అన్నారు. టీటీడీలోని వివిధ శాఖల అధికారులు, తిరుపతి, తిరుమల పోలీసు అధికారులు, టీటీడీ చీఫ్ పీఆర్‌వో రవి, ఎస్వీబీసీ సీఈవో ఫణికుమార్ నాయుడు, డీఎఫ్‌వో సెల్వం, జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఆరోగ్యం ముఖ్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తిరుపతి(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యం ప్రధానమని లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ భాస్కర్ వివరించారు. లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆధ్వర్యంలో హ్యాపీ మైండ్... హెల్దీ లైఫ్ అనే అంశంపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాయల్ చెరువు రోడ్డులోని సుధాహ లిటిల్ సిటిజన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మనసు ప్రశాంతంగా ఉంటే శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. సంస్థ అధ్యక్షుడు బండి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించాలంటే మానసిక, శారీరక దృఢత్వం అవసరమన్నారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. లైన్స్ క్లబ్ కార్యదర్శి చక్రపాణి, కోశాధికారి పురుషోత్తమ నాయుడు, సభ్యులు రామచంద్రారెడ్డి, హెచ్‌ఎం లలిత పాల్గొన్నారు.

2025 వ్యాలిడేషన్ బిల్లును రద్దు చేయండి


నిరసన తెలుపుతున్న సీఆర్‌ఎస్ విశ్రాంత ఉద్యోగులు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025 వ్యాలిడేషన్ బిల్లును రద్దు చేయాలని రైల్వే సీఆర్‌ఎస్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, ఆర్‌ఎం విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఆర్‌ఎస్ పరిపాలన భవనం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 8వ వేతన కమిషన్ ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వేలో రాయితీ కల్పించాలని కోరారు. సీఆర్‌ఎస్ డిప్యూటీ సీఎంఈ ప్రమోద్‌కు వినతిపత్రం అందజేశారు. గజపతి నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేణిగుంట సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడానికి రేణిగుంట 220కేవీ సబ్‌స్టేషన్‌లో ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తిరుపతి టౌన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం 31.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉందన్నారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్న కారణంగా దాన్ని తొలగించి 51 ఎంవీఏ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కారణంగా రేణిగుంట మండలంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.



నన్ను ఇప్పుడు 'ఓజీ' డ్రమ్మర్ అంటున్నారు

● శివమణి

తిరుమల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): 'చెన్నైలో ఉన్నప్పుడు నన్ను అందరు ఏఆర్ రెహ్మాన్ డ్రమ్మర్ అంటారు. ఇప్పుడు కొత్త ట్రెండ్ మొదలైంది. నన్ను చూడగానే 'ఓ.జీ' డ్రమ్మర్ వచ్చేశారు అంటున్నారు' అని డ్రమ్స్ శివమణి సంతోషంగా చెప్పారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం ఆయన దర్శించుకున్న ఆయన మీడియాతో మాటాడుతూ, బాలయ్య 'అఖండ-2' చిత్రం కోసం నేరుగా ముంబై వెళ్తున్నానని చెప్పారు. ఇలా ఉండగా, స్వామి దర్శించుకునే సమయంలో కూడా శివమణి చేతిలో డ్రమ్స్ స్టిక్స్ ఉన్నాయి. దీనిని చాలా మంది ఆసక్తిగా చూశారు.

ఆలయం ముందు డ్రమ్స్ స్టిక్స్‌తో శివమణి



స్వాతి (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో స్టాఫ్ నర్సు మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు స్టాఫ్ నర్సు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ ఇన్‌ఛార్జి సీఐ గోపి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు గ్రామానికి చెందిన గురవయ్య ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంటాడు. ఆయన భార్య స్వాతి(26). ఈమె శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తుండేది. శుక్ర వారం రాత్రి విధులు ముగిసిన అనంతరం గురవయ్య భార్య స్వాతితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణ శివారు అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై వెళుతుండగా టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో స్వాతి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సాయంతో భర్త ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీక రించారు. భర్త, కుటుంబసభ్యులు బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,883

తలనీలాలు సమర్పించినవారు: 26,000



జిల్లా హౌసింగ్ హెడ్ దయాకర్ సస్పెన్షన్

● మరో 12 మంది కిందిస్థాయి అధికారులపై చర్యలకు సిఫార్సు

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ (ఇన్‌ఛార్జి) పి.దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఈఈగా, ఈఈగా పనిచేసినప్పుడు కొండ్లపూడి, వెంకటేశ్వరపురం లే-అవుట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టేట్ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడి, హౌసింగ్ కార్పొరేషన్ ఖజానాకు రూ. కోట్లలో నష్టం కల్గించారని, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో కూడా విఫలమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో దయాకర్‌పై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్‌తోపాటు లే అవుట్లలో అవినీతి కార్యకలాపాల్లో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజినీరు పసుపులేటి సురేష్‌కుమార్ ((రిటైర్డ్), గొల్లపూడి రామకృష్ణ (రాపూరు), ఎ.నాగరాజు (అప్పటి డివిజన్ హెడ్-రిటైర్డ్), ఎం.వెంకటమోహనరావు (ప్రస్తుత నెల్లూరు డివిజన్ హెడ్), పల్లా వెంకటదాసు (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్ - కర్నూలు జిల్లాలో పదవీ విరమణ చేశారు), పరవస్తు నరసింహం (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్-రిటైర్డ్), తోట వెంకటశేషయ్య (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్), మొహమ్మద్ జహీరుద్దీన్ అహ్మద్ (ప్రస్తుతం సర్వేపల్లి రూరల్ సబ్ డివిజన్ డీఈఈ), పఠాన్ అహ్మద్‌బాషా, (రిటైర్డ్ ఏఈ), తాళ్లూరు భాస్కరరావు (ప్రస్తుతం మనుబోలు మండల ఏఈ), ఎం.మధుసూధనరావు (అప్పటి ఏఈ-ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు), ఎం.కృష్ణారెడ్డి (రిటైర్డ్ ఏఈ)లపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి అదనపు చెల్లింపుల మొత్తాన్ని తిరిగి రాబట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని ఆదేశిస్తూ లేఖ రాశారు.

లైసెన్స్ లేని బాణసంచా కంటైనర్, లారీ సీజ్



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తమిళనాడు శివకాశి నుంచి లైసెన్స్ లేకుండా బాణసంచాతో వచ్చిన కంటైనర్, లారీని తిరుపతి, రేణిగుంట పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడికి అందిన రహస్య సమాచారం మేరకు.. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి సిబ్బందితో కలిసి కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద తనిఖీలు చేపట్టారు. శివకాశి నుంచి కంటైనర్‌లో తెప్పించిన రూ రూ.2.5 లక్షల విలువ చేసే 38 బాక్సుల బాణసంచా కనిపించింది. అదే సమయంలో రేణిగుంటలో పట్టుబడిన లారీలో తనిఖీ చేయగా రూ.2.8 లక్షల బాణసంచా దొరికింది. లైసెన్స్ లేకపోవడంతో రెండింటినీ సీజ్ చేశారు. మిట్టూరు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. లైసెన్సు లేకుండా బాణసంచా తెచ్చినా, విక్రయించినా, నిల్వ చేసినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. అలాంటి సమాచారం అందితే 112కు తెలియజేయాలని కోరారు.

తిరుచానూరు నుంచి మరిన్ని రైళ్లు



సీసీఐ శ్రీకాంత్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి మరిన్ని రైళ్లను నడపనున్నట్లు తిరుపతి చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఆయన సికింద్రాబాదు నుంచి వచ్చిన ప్రత్యేక రైలు ప్రయాణికులను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను పెంచినట్లు చెప్పారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్వహణ, పార్కింగ్ సమస్యల కారణంగా తిరుచానూరు స్టేషన్ నుంచి ప్రత్యేక రైళ్లతోపాటు ప్యాసింజర్లను నడపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని తెలిపారు. ఇప్పటికే ఐదు ప్రత్యేక రైళ్లను ఈ స్టేషన్ నుంచి నడుపుతున్నామని, మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెన్నై, అరక్కోణం వరకు మెము రైళ్లను రోజూ నడుపుతున్నామని తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సీసీఐ చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాస్, రాజేంద్ర పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన వేప చెట్టు కొమ్మ

● భక్తులకు తప్పిన ప్రమాదం



కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన చెట్టు కొమ్మ

చంద్రగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని భారీ వేప చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగిపడింది. అయితే భక్తులకు ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వేపచెట్టు బాగా తడిసింది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ధ్వజస్తంభం నుంచి బలిపీఠం వరకు విస్తరించి ఉన్న భారీ వేపకొమ్మ విరిగి పడింది. దీంతో ఆలయ ఆవరణలోని విద్యుత్ తీగలు, ఇనుప పైపులు, పందిరిపై పడటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఘటన జరిగిన సమయంలో భక్తుల రద్దీ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. తక్షణమే అధికారులు, సిబ్బంది విరిగిన కొమ్మలను తొలగించారు.

దూరవిద్య ఉద్యోగి మృతి



మునిశేఖర్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ ఉద్యోగి మునిశేఖర్ (40) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లె పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన మునిశేఖర్ 20 ఏళ్లుగా ఎస్వీయూలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మునిశేఖర్ మృతికి దూరవిద్య ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

'సీఎంఆర్'లో అగ్నికీలలు

● షార్ట్‌సర్క్యూట్‌తో ఆయిల్ పైపు అంటుకోవడంతో ప్రమాదం

● మూడు గంటల పాటు అదుపులోకిరాని మంటలు ● అస్వస్థతకు గురైన పలువురు కార్మికులు





సీఎంఆర్ కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు, అలుముకున్న పొగ - కంపెనీలో ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

ఏర్పేడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంచింతపాళెం రెవెన్యూ పరిధిలోని సీఎంఆర్ అల్యూమినియం ఈకో కంపెనీలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆయిల్‌పైపు లీకు కావడం.. షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఆ ఆయిల్ అంటుకొని మంటలు చెలరేగినట్లు పరిశ్రమ వర్గాలు, అధికారులు చెబుతున్నారు. ఈ మంటలను గుర్తించి కార్మికులు బయటకు పరుగుతీశారు. అప్పటికే దట్టంగా పొగ అలుముకోవడంతో ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిపడి కొందరు అస్వస్థతకు గురయ్యారు. వీరిని తిరుపతి, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు తరలించారు. మరోవైపు పరిశ్రమంలోని ఇంజన్ల ద్వారా మంటలను అదుపుచేసేందుకు యత్నించినా సాధ్యపడలేదు. దీంతో 112కు ఫోన్ చేసి కంపెనీ అధికారులు తిరుపతి, వెంకటగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి ఫైర్‌ఇంజన్లను రప్పించారు. సుమారు మూడు గంటల పాటు కష్టపడి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో చింతపాళెం, రాజులపాళెం గ్రామాల్లోనూ పొగ అలుముకుంది. వెంకటగిరికి వెళ్లే వాహనదారులూ ఇబ్బంది పడ్డారు. మరోవైపు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టారు.



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం

ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమ లోపల 300 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లారు. సాయంత్రం ఐదున్నర గంటలకు బయటకు రావాలి. 5 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. అందరూ అప్రమత్తమై బయటకు పరుగు తీయడంతో ప్రాణనష్టం తప్పింది.

అట్టహాసంగా 'మోహన మంత్ర'

● ఎంబీయూలో ఆకట్టుకున్న ఈవెంట్లు





చంద్రగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మోహన మంత్ర మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎంబీయూ ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంచు విష్ణు మాట్లాడుతూ ఎంబీయూ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం నిర్వహించే మోహన మంత్ర కార్యక్రమం విద్యార్థుల సాంస్కృతిక వేడుక అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడానికే ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్శిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్లను ఆయన స్వయంగా వెళ్లి తిలకించారు. కొన్ని ఈవెంట్లలో మంచు విష్ణు పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

ఆకట్టుకున్న ఈవెంట్లు

మోహనమంత్ర కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు టెక్నోహాలిక్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంబెడెడ్ వర్క్‌షాప్, కోడ్ ప్రింట్, లైఫ్ సేవర్, ఈవీ వర్క్‌షాప్‌లు, టెక్ ఎక్స్‌ప్రోటోటైప్, ఈవీ ఎక్స్‌క్యూజోనోమిక్స్‌లు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్లలో భాగంగా లెట్స్ నాచో, చికెన్ డిన్నర్(పబ్జీ), కరోకే కెచప్, పుష్ అప్ ఛాలెంజ్, ఎం ప్రాజా ఈవెంట్లు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఫ్రీ ఫైర్, గల్లీ క్రికెట్, మిక్స్ బాస్కెట్ బాల్, ట్రెజర్ హంట్, లక్కీ డ్రా, ఫన్ గేమ్స్, ఫుడ్ ఛాలెంజ్, జార్బింగి బాల్స్ వంటి ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కేరింతల నడుమ మొదటి రోజు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు పాల్గొన్నారు.



డ్రమ్స్ శివమణి కార్యక్రమంలో విద్యార్థుల ఈలలు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు నరసింహయాదవ్, సుగుణమ్మ తదితరులు

జీఎస్టీ 2.0 సేల్స్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన

తిరుచానూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం ప్రదర్శించిన జీఎస్టీ 2.0 సేల్స్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రారంభించారు. రాష్ట్ర జీఎస్టీ శాఖ, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో వంట సామగ్రి, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, కార్లు, స్కూటర్లు, సోలార్ తదితర వస్తువులకు సంబంధించి సుమారు 30స్టాల్స్ ఏర్పాటు చేశారు. తగ్గిన జీఎస్టీ వివరాలను వినియోగదారులకు నిర్వాహకులు వివరించారు. ఈ స్టాల్స్‌ను రీజనల్ జీఎస్టీ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర పరిశీలించారు. తగ్గిన ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్‌రాజు, నాయకులు కేవీ చౌదరి, వాసవి ఏజేన్సీ అధినేత ఏవీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయం పాలకమండలి ప్రమాణ స్వీకారం



చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మనాభరాజు

నాగలాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర ఆలయ పాలక మండలి శుక్రవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో చైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీళపూడికి చెందిన టీడీపీ నేత పద్మనాభరాజు, సభ్యులుగా హంస, శ్రీనివాసులు, జయంతి, నెల్సన్ మండేలా, దేవి, కవిత, హేమంత్‌కుమార్, నాగభూషణమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా పాలకమండలి నియామకానికి ప్రభుత్వం గురువారం రాత్రి జీవో విడుదల చేయగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఈవోకు ఉత్తర్వులు అందాయి. గంటల వ్యవధిలోనే సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సత్యవేడు మండలానికి చెందిన కృష్ణయ్య యాదవ్ పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈయన చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మాజీ ఎంపీపీ మధుబాల, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సతీష్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జయచంద్రనాయుడు, నాయకులు బాలరాజు, రామకృష్ణమరాజు, బుజ్జినాయుడు, రామచంద్రరాజు, దుష్యంతరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సన్నిధిలో నూతన పాలక మండలి సభ్యులు

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష

● 15 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. మరో 15 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు

బాలాయపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిబంధలనకు విరుద్ధంగా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసిన రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు నమోదైంది. 2019 అక్టోబరులో బాలాయపల్లి తహసీల్దారుగా నియమితులైన ఆదిశేషయ్య 18 నెలల పాటు ఆ మండలంలో విధులు నిర్వహించారు. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రామాపురం గ్రామంలోని ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామస్తులు 2023లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం రిటైర్డ్ అయిన తహసీల్దారు ఆదిశేషయ్యపై 1644/2023/బి1 నంబరుతో కేసు నమోదు చేసిన లోకాయుక్త విచారణకు ఆదేశించింది. ఇందుకోసం జాయింట్ కలెక్టర్‌ను విచారణాధికారిగా, గూడూరు ఆర్డీవోను రికార్డుల పరిశీలనకు ప్రజెంటేషన్ అధికారిగా నియమించింది.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్/ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ తీర్పునిచ్చారు. ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన వీరాస్వామి, పోలయ్య పొలం హద్దుల విషయమై 2017 ఏప్రిల్ 10వ తేదీన గొడవ పడ్డారు. ఈ క్రమంలో పోలయ్యపై వీరాస్వామితో పాటు గ్రామానికి చెందిన 9మంది కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆస్పత్రిలో పోలయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరాస్వామిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ సుందరయ్య వాదించారు.

గువ్వల కాలనీలో యువకుడి హత్య



మెడపైన రక్తగాయంతో చికిత్స పొందుతున్న శ్రీహరి (చనిపోయేముందు)

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గువ్వల కాలనీలో యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. గువ్వల కాలనీలో ఉంటున్న ఓ మేస్త్రీ తన భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. స్థానికంగా ఉన్న కొంతమంది మేస్త్రీ పట్ల అవహేళనగా మాట్లాడడంపై మూడు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం పక్కింటి వారితో మద్యం మత్తులో మేస్త్రీ ఘర్షణపడ్డాడు. ఆ సమయంలో మేస్త్రీని అడ్డుకునే క్రమంలో శ్రీహరి(16) ప్రయత్నించాడు. దీంతో పూసలు చుట్టే కత్తితో మేస్త్రీ అతడి మెడపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన శ్రీహరిని చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేశారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దర్శన్

తిరుమల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది.టీటీడీ బోర్డు సభ్యుడు దర్శన్ ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని తిరుపతిలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సీజేపై చెప్పు దాడి ఘటనకు.. మోదీ బాధ్యత తీసుకోవాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితులపై దాడులు పెరిగాయని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు దాడి జరిగిందని, వీటికి ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సీజేపై చెప్పు దాడి, హరియాణాలో ఎస్సీ డీజీపీపై అక్కడి బీజేపీ ప్రభుత్వం వేధింపులకు నిరసనగా ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి తిరుపతి ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. చింతా మాట్లాడుతూ సీజేపై చెప్పు దాడి ఘటనకు ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. మన రాష్ట్రానికి చెందిన ఒక దళిత డీజీపీ హర్యానాలో అక్కడి ప్రభుత్వం పెట్టిన వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మన రాష్ట్రంలోనూ దళితులపై, దళిత అధికారులపై దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. వీటిని కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపిగౌడ్, రవి, రావణ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలుపుతున్న చింతా మోహన్



పుత్తూరు వార్తలు

ఎమ్మెల్యేను కలిసిన ఎస్పీడీసీఎల్ ఎస్ఈ



పుత్తూరు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను ఎస్పీడీసీఎల్ ఎస్ఈగా నియమితులైన చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన్ను కలిసి ఘనంగా సత్కరించారు. ఎస్ఈకి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్



ప్రసంగిస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పుత్తూరులోని ఆరోగ్య, విద్య, ప్రభుత్వ వసతి సముదాయాలు, వివిధ శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో నీరు నిలిచి దోమల వృద్ధికి కారణమవుతున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రజలు డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించాలని ఆరోగ్య కార్యదర్శులను ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వార్డులలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని సూచించారు.

టపాకాయల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

వడమాలపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టపాకాయల దుకాణదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ జరీనా, ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. శుక్రవారం వడమాలపేటలో పర్మినెంట్ లైసెన్స్ కలిగిన కార్తికేయ క్రాకర్స్ దుకాణాన్ని పరిశీలించారు. పుత్తూరు అగ్నిమాపక శాఖ అధికారి గిరిధర్ మాట్లాడుతూ లైసెన్స్ రెన్యువల్ చేసుకునే వారు దుకాణాలను నిర్జన ప్రదేశంలో నిర్వహించాలని చెప్పారు. నీరు, ఇసుక తప్పకుండా ఉండాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పుత్తూరు,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని పట్టణ రూరల్ ఏఈలు జయసాయి, భాస్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభయ హస్తాదీశుడి సేవలో న్యాయమూర్తులు



వడమాలపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలో అభయ హస్తా దీశుడి రూపంలో కొలువైన ప్రసన్న వెంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు బి.కృష్ణ మోహన్, చీమలపాటి. రవిలు కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించు కున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారా చార్యులు ఆలయ చరిత్రను వివరించారు. తీర్థప్రసాదాలు అందజేసి వేదశీర్వచనం చేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.

లారీతోపాటు టపాసుల సీజ్

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : లారీతోపాటు టపాసులను అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం సీఐ జయచంద్ర సిబ్బందితో కలిసి గురవరాజుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టపాసుల గోదాం వద్ద లైసెన్స్ లేని లారీతోపాటు రూ.4లక్షల విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయస్థాయి సెపక్‌తక్రాకు పల్లం విద్యార్థిని



శిరీషను అభినందిస్తున్న టీచర్లు

ఏర్పేడు, అక్టోబరు 10(ఆంధ్ర జ్యోతి): కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా సబ్ జూనియర్ టోర్నమెంట్‌లో పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష జాతీయ స్థాయికి ఎంపికైందని ప్రధానో పాధ్యాయులు ఆనంద్ తెలిపారు. శుక్రవారం శిరీషను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు వాణి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో ఎల్లమండ్యం, గాజులమండ్యం, తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి, కుర్రకాలువ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ డీఈఈ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



సత్యవేడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని సత్యవేడు పోలీసులు పట్టు కున్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమా వేశంలో సీఐ మురళి వివరాలను మీడియాకు వెల్లడించారు. గతనెల 19వ తేదీన సత్యవేడులోని చెన్నైరోడ్డు వద్ద ఎస్ఐ రామస్వామి సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి రవాణా చేస్తున్న తమిళనాడు రాష్ట్రం మాదరపాకానికి చెందిన శ్రీధరన్ (35)ను అరెస్టు చేశారు. అతడినుంచి ఒకటిన్నర కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో పరారీలో ఉన్న శ్రీధరన్ తమ్ముడు విజయ్ (30)ను శుక్రవారం ఉదయం దళవాయి అగ్రహారం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉత్తమ పంచాయతీలకు కేంద్రం ప్రోత్సాహకాలు

డక్కిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం గ్రేడును బట్టి రూ.కోటి వరకు నగదు అందజేస్తుందని ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో జరిగే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఆన్‌లైన్‌లో రేటింగ్‌లు విధిగా నమోదు చేయాలని సూచించారు. ఉత్తమ రేటింగ్‌లో సాధించిన పంచాయతీలకు గ్రేడ్‌ను బట్టి రూ.కోటి వరకు నగదు బహుమతులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య, తాగునీరు, పారిశుధ్యం, వృత్తి శిక్షణ, డిజిటల్ సేవలు, జీవన ప్రమాణాలు వంటి విభాగాల్లో పనితీరును అంచనా వేస్తారని చెప్పారు. ఏఎస్‌వో వెంకటయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఒకరి మృతి

ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామానికి చెందిన సురేష్, ఆయన భార్య కళావతి, సమీప బంధువు లలితమ్మలు మనుబోలు మండలం పిడూరు గ్రామంలోని జామాయిల్ తోటలో కూలి పనులకు రెండు రోజుల క్రితం వెళ్లారు. గురువారం రాత్రి తిరిగి స్వగ్రామానికి ఆటోలో వస్తుండగా నరసారెడ్డికండ్రిగ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కళావతి తీవ్రంగా గాయపడగా, సురేష్, లలితమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కళావతి(29) పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

కోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని గూడూరు డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం రాత్రి ఆమె కోట పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.





తవ్వకాలు చేస్తున్న గ్యాస్ పైపులైన్ నిర్వాహకులు - మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న ట్యాంకర్ల నుంచి తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

గ్యాస్ పైపులైన్ కోసం అడ్డగోలు తవ్వకాలు

మంచినీటి పైపులైన్ల ధ్వంసం ● సరఫరాలో ఇబ్బందులు

నాయుడుపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్యాస్ పైపులైన్ కోసం అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతుండడంతో రోడ్డు దెబ్బతినడంతో పాటు తాగునీటి పైపులు ధ్వంసం అవుతున్నాయి. కొంతకాలంగా మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో గ్యాస్ పైపులైన్ కోసం ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లను తవ్వేస్తున్నారు. దీంతో రోడ్లు ధ్వంసం కావడంతో పాటు తాగునీటి పైపులు పగిలిపోతున్నాయి. రెండు రోజుల క్రితం స్థానిక పొగగొట్టంకాలనీలో గ్యాస్ పైపులైన్ కోసం చేపట్టిన తవ్వకాలతో తాగునీటి పైపులు ధ్వంసమయ్యాయి. తాగునీటి సరఫరా ఆగిపోవడంతో మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లను బాగు చేయడంతో పాటు తాగునీటి పైపులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరినా పట్టించుకోవడంలేదు. నిబంధనల ప్రకారం ఒక ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి, అక్కడ మరమ్మతులు పూర్తయిన తరువాత మరొక ప్రాంతంలో తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అయితే నిబంధనలు పాటించకుండా తవ్వకాలు చేపడుతూనే ఉన్నారు. దీంతో అనేకచోట్ల పైపులైన్లు ధ్వంసం కావడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ మున్సిపాలిటీలో గ్యాస్ పైపులైన్ తవ్వకాలకు అనుమతులు లేవని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు.

జీఎస్టీ 2.0తో అన్ని వర్గాలకు ప్రయోజనం: విజయశ్రీ



జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతకు మునుపు 5, 12, 18, 28 శాతం జీఎస్టీ శ్లాబులు ఉండగా గత నెల 22 నుంచి 5, 18 శాతం అమల్లోకి వచ్చాయన్నారని తెలిపారు. ఈ సంస్కరణల ద్వారా కొన్ని వస్తువులపై పన్ను పూర్తి రద్దు చేయగా, మరి కొన్నింటిపై తగ్గించారన్నారు. సంబంధిత అధికారులు జీఎస్టీ కొత్త విధానంపై వ్యాపార వర్గాలకు, కొనుగోలు దారులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు మాట్లాడుతూ నూతన జీఎస్టీ విధానాన్ని వ్యాపారస్తులు తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం వ్యాపారులు ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ తదితర వస్తువులను ఎమ్మెల్యే అధికారులు పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. ముందుగా ఎమ్మెల్యేను వ్యాపారులు, జీఎస్టీ అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, జీఎస్టీ అధికారి నరసింహులు, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బాలాంజనేయస్వామి దేవస్థాన చైర్మన్ వాకచర్ల రమేష్, వాకచర్ల శాంతారావు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడు, వజ్జావారిపాళెం, కరబల్లవోలు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.

తడ: సూళ్లూరుపేట, మన్నెముత్తేరి, తడ, బీవీపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శేఖర్ తెలిపారు.

గూడూరు: పట్టణంలోని 133 కేవీ సబ్‌స్టేషన్, లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ప్రసాద్ తెలిపారు.

కోట: మండలంలోని కోట, కొత్తపాళెం, వంజివాక, సిద్దవరం, ఉత్తమనెల్లూరు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అనంతరావు తెలిపారు.

డక్కిలి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అశోక్ తెలిపారు.

మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ

ఓజిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు పెరటి కోళ్లు అందజేశారు. ఓజిలి మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ, తహసీల్దారు పద్మావతి, ఏపీఎం పద్మమ్మ, సీసీ సుభాషిణి, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, జిల్లా బీసీసెల్, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ఎస్కే ఖలీల్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి

తడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతులపై ప్రతి అధికారి దృష్టి పెట్టాలని ఎంపీడీవో శేఖర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు శరత్‌బాబుతో కలసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వో వాటర్ అందించడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈవో వేములు, పంచాయతీ కార్యదర్శులు శేషారావు, గాబ్రియల్, మస్తాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

బాలాయపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యనిపుణులచే ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 122 మందికి కంటి పరీక్షలు చేశారు. 73 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లంటి కృష్ణయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు దొమ్మరాజు ప్రశాంతిరాజు, కొండూరు సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చెంచుమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

పెళ్లకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల సమీపంలో వెలసిన నరసింహస్వామి సమేత చెంచు మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ పురోహితులు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో హోమం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకించారు. అమ్మవారికి చందనాలంకారం చేశారు. చిల్లకూరు సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, ప్రవీణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు



టపాసుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు జయజయరావు, అగ్నిమాపక శాఖ అధికారులు

కోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాదారులు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని తహసీల్దారు జయజయరావు హెచ్చరించారు. మండల పరిధిలోని చెందోడు, వెంకన్నపాళెం గ్రామాల్లో ఉన్న బాణసంచా దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు ఆరా తీశారు. విద్యుత్ సరఫరా ఆగిపోయినప్పుడు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రొటోకాల్ విధులకు తహసీల్దార్లు

తడ/డక్కిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తడ తహసీల్దారు శరత్‌బాబు, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు వారం రోజుల పాటు డిప్యుటేషన్‌పై కర్నూలుకు వెళ్తున్నారు. ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో వీరికి కర్నూలులో ప్రొటోకాల్ విధులు కేటాయించారు. వీరు తిరిగి వచ్చే వరకు తడకు సూళ్లూరుపేట తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి, డక్కిలికి వెంకటగిరి తహసీల్దార్ నరిసింహరావులకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఉత్తర కొరియా, హైదరాబాదు, ఒంగోలులో ఉన్న స్నోవాసిస్ కంపెనీ బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ, ఈసీఈ, ఐటీఐ, ఎఐడీఎస్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. 430 మంది విద్యార్థులు పాల్గొనగా మొదటి రౌండ్‌లో 76 మంది, రెండవ రౌండ్‌లో 14 మంది ఎంపికయ్యారు. వారికి టెక్నికల్, ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ కిషొంధర్, కంపెనీ ప్రతినిధులు కిషోర్, సుధీర్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి గర్హనీయం

గూడూరు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి గర్హనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈనెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దేవదాసు కోరారు. అలాగే 15న అన్ని మండల కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతామన్నారు.

మానసిక వికలాంగులకు వరం.. భవిత కేంద్రాలు

వెంకటగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగులకు భవిత కేంద్రాలు వరంలాటివని ప్రముఖ న్యాయవాది గాంధీ అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవం జరిగింది. నిర్వాహకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతోందన్నారు.



నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలోని నందగోకులం స్కూల్‌తో పాటు పలు సంస్థలను ప్రారంభించేందుకు శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.

వెంకట్రాయులు గుంటకు హద్దుల ఏర్పాటు

పెళ్లకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లగా వివాదాస్పదంగా మారిన వెంకట్రాయులు గుంటకు శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. మండలంలోని అనకవోలు పంచాయతీ పెరుమాళ్లపల్లి గ్రామంలోని వెంకట్రాయులుగుంటకు సమీపంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వట్టికుండల శేఖర్‌నాయుడుకు చెందిన 12 ఎకరాల భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భూములు వెంకట్రాయులు గుంటకు సంబంధించినవని, సాగుచేయడానికి వీలులేదంటూ కొంతమంది అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తన భూములను సర్వే చేసి ఇవ్వాలని శేఖర్‌నాయుడు అధికారులను కోరారు. దీంతో శుక్రవారం సర్వే చేపట్టి వెంకట్రాయులుగుంట 9.68ఎకరాల్లో విస్తరించి ఉందని నిర్ధారించారు. హద్దుల మేరకు చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ తీశారు. ఈ క్రమంలో వెంకట్రాయులుగుంట విస్తీర్ణం ఇంకా ఎక్కువ ఉందంటూ గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అధికారులకు గ్రామస్తులకు వాగ్వావాదం జరిగింది. ఇరిగేషన్ డీఈ విశ్వనాథ్, ఏఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు గ్రామస్తులకు సర్దిచెప్పి రికార్డుల ప్రకారం హద్దులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీ బాయి, వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ సుప్రజ పాల్గొన్నారు.

రూ.34 కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి



సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, రవి, వైస్ చైర్మన్ రఫీ తదితరులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలను రూ.34 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం నాయుడుపేట పాత బీడీ కాలనీలో రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.18 కోట్లు, నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.16 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, నాయకులు పసల గంగాప్రసాద్, అవధానం సుధీర్, జయరాం, నసీం, అశోక్, హరనాథ్‌రెడ్డి, సుజాత, రేవతి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయండి



ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నీరజ

చిల్లకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు సమీపంలో ఉన్న ఏఎంసీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్ పర్సన్‌గా చిల్లకూరు నీరజమ్మ, వైస్ చైర్మన్‌గా సోమిశెట్టి చెంచు రామయ్యతో పాటు డైరెక్టర్లుగా పెజ్జాయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నెల్లటూరు సుప్రజ, వేముల సునీల్, జాకీర్, కిషోర్, కృష్ణయ్య, శ్యామల, పర్వీన్, ప్రకాష్ నాయుడు, సుధా, కృష్ణమ్మ, నిర్మలమ్మ, మల్లికార్జున్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, తీగల చంద్రశేఖర్, మస్తాన్‌నాయుడు, రాజేంద్ర, వేముల సునీల్ పాల్గొన్నారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులలో హెచ్‌ఎంలు, పీడీలు

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికలకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వీరు ఈనెల 20వ తేదీన నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీవైఈవో సనత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రబాబు, కాంచన, హెచ్‌ఎంలు భారతి, సుధారాణి, డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, పీడీలు సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రావు, భాస్కర్, సురేష్‌బాబు, రమేష్‌బాబు, శ్రీను, కరిముల్లాఖాన్ పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ

ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని పంచాయతీల పురోగతి సూచికపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల్లో ప్రజల శ్రేయస్సుతో పాటు తొమ్మిది విషయాల ఆధారంగా అభివృద్ధి స్థితిని అంచనా వేయడం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. ఎంపీపీ అరుణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు


రిజిస్టర్లను పరిశీలిస్తున్న వసంతబాయ్

నారాయణవనం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెత్తల తడుకు అంగన్వాడీ కేంద్రాన్ని తిరుపతి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ వసంతబాయ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో తయారు చేసిన వివిధ రకాల బోధన సామగ్రిలను, ఫుడ్ స్టాకు రిజిస్టర్లను, పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాల్య వివాహాలు, నివారణ చర్యలు, చట్టాలపై అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. అలాగే పిల్లల గ్రోత్ మానిటరింగ్ పర్యవేక్షణ చేశారు. ఆమెతో పాటు జిల్లా మెషన్ కో-ఆర్డినేటర్ కృష్ణమందిరి, అంగన్వాడీ టీచర్ రెడ్డెమ్మ ఉన్నారు.

మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడిగా ఆయగ వేలు


అధ్యక్షుడుగా ఆయగ వేలుకు పత్రాలు అందజేస్తున్న మత్స్యశాఖ అధికారులు

కేవీబీపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు గ్రామానికి చెందిన ఆయగవేలు మత్స్య కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి మధుసూదన్ తెలిపారు. 9 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని వివరించారు. శుక్రవారం కళత్తూరు మత్స్య కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఏవీ రమణ వ్యవహరించారు. ఆయకట్టు అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహామండలి డైరెక్టర్ ఎం.సుబ్బయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. దీపం-2 పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు సిలిండర్లు, తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికీ రూ.15వేలు, రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.

సురుటుపల్లి ఆలయ చైర్మన్‌గా పద్మనాభరాజు



పిచ్చాటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీళపూడి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పద్మనాభరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. క్షత్రియ వర్గానికి చెందిన ఆయన ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులుగా ఉన్నారు. తొలినుంచి తెలుగుదేశం పార్టీకి వీర విధేయులుగా ఉన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ వెంట పాదయాత్ర చేశారు. టీడీపీ నియోజకవర్గ పార్టీ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు కావడంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అండదండలు ఉండడంతో ట్రస్టు బోర్డు చైర్మన్‌గిరి వరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, స్థానిక నాయకుల ఆశీస్సులతో ఈ పదవి లభించిందన్నారు. తనకు పదవి రావడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

వినాయక ఆలయ పునర్నిర్మాణ స్థల పరిశీలన

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయం అయిన భేరీవారి మండపం వద్ద ఉన్న వినాయక ఆలయ పునర్నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

తపాలా ఉద్యమ నేతను విధుల్లోకి తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి మహా దేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమని వెంటనే ఆయన్ను విధుల్లోకి తీసుకోవాలని పోస్టుమెన్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మురళి కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సిబ్బంది నిరసన చేపట్టారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, ఏఐజీడీఎస్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మురళీధర్, కిరణ్‌కుమార్, విజయకృష్ణ పాల్గొన్నారు.

లారీ ఢీకొని బీటెక్ విద్యార్థినికి తీవ్ర గాయాలు

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని బీటెక్ విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం కరకంబాడి రోడ్డులోని పాత రేణిగుంట వంతెనపై చోటుచేసుకుంది. పాత చెక్‌పోస్టు సమీపంలో నివాసముంటున్న మధుసూదన్ తన కుమార్తెను కళాశాల నుంచి తీసుకొస్తుండగా ఫోన్ వచ్చింది. దీంతో రోడ్డుకు పక్కగా మోటారు సైకిల్‌ను నిలిపి ఫోన్ మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన మినీలారీ ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్‌లో వెనుక కూర్చుని ఉన్న బీటెక్ విద్యార్థిని తీవ్రంగా గాయపడగా ఆమె తండ్రి కి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుంది


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనంలోని స్థానిక దుండి వినాయకస్వామి ఆలయం వద్ద బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. నారాయణవనానికి చెందిన కలతి మొదలికి రూ.2,28,323, నాగలాపురం మండలంలోని విజయకుమార్‌కు రూ.1,46, 987, కేవీబీ పురం మండలానికి చెందిన జగదీష్ మృతిచెందగా కుటుంబానికి రూ.31,843లు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

వానెల్లూరు డీకేటీ పట్టాలను రద్దు చేయాలి : సీపీఎం

సత్యవేడు, అక్టోరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వానెల్లూరు రెవెన్యూలో అక్రమంగా ఇచ్చిన డీకేటీ పట్టాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో పని చేసిన రెవెన్యూ అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించి పేదలకు చెందాల్సిన భూములనే కాకుండా, అటవీ భూములను కూడా వదలకుండా దొంగ సర్వే నంబర్లు వేసి అక్రమార్కులకు వందల ఎకరాలను కట్టబెట్టారని ఆరోపించారు. అక్రమ పట్టాలు ఇచ్చిన అప్పటి రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించి వారిని జైలుకు పంపాలని కోరారు.

గుడిమల్లం ఆలయ హుండీ లెక్కింపు

ఏర్పేడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన గుడిమల్లం ఆనందవల్లి సమేతపరశురామేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. రూ.2,20,902 దాదాయం వచ్చింది. ఈ మొత్తం 34 రోజులకు వచ్చిన ఆదాయం. అన్నదానం హుండీల ద్వారా రూ.24,875 వచ్చింది. మొత్తం రూ.2,45,777 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో తిరుపతి దేవదాయశాఖ డివిజన్ తనిఖీ అధికారి పణిరాజసేన, ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, తానికొండ మణిబాబు సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వర స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ధర్మశాల ఎమ్మెల్యే సుధీర్‌శర్మ, హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్ పూర్ ఎమ్మెల్యే ఆశిష్ వర్మ దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చి నాయుడు కండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉందని వివరించారు.

సురుటుపల్లి ఆలయ కమిటీ సభ్యురాలిగా కవిత



కేవీబీపురరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం సభ్యురాలిగా కేవీబీపురం మండల కేంద్రానికి చెందిన కవితకు చోటుదక్కింది.

ఘనంగా వరల్డ్ మెంటల్ హెల్త్‌డే

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా వరల్డ్ మెంటల్ హెల్త్ డే నిర్వహించారు. వైద్యులు మానసిక ఆరోగ్యం గురించి ప్రజలకు వివరించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఆర్ఎంవో మణి, మండల న్యాయ అధికార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమరలో అరుదైన శస్త్రచికిత్స


ఆపరేషన్‌ను విజయవంతం చేసిన జపాన్‌కు చెందిన కార్డియాలజిస్టు, ఆస్పత్రి వైద్యులు

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : అమర ఆస్పత్రిలో మరో అరుదైన ఆపరేషన్ విజయవంతమైంది. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ కార్డియాలజిస్టు డాక్టర్ సెరికావాటకేశి, అమర ఆస్పత్రి వైద్యులు వెంకటశివకృష్ణ, వెంకటేష్ గురజాల, నౌషాద్‌లు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఓ రోగి గుండెలో బ్లాక్ అయిన రక్తనాళాలను తిరిగి తెరిచారు. అత్యంత సవాలుతో కూడుకున్న ఈ శస్త్ర చికిత్సను అత్యాధునిక సాంకేతిక పరికరాలతో విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపింది.

టపాకాయల తయారీకి అనుమతులు తప్పనిసరి

వరదయ్యపాళెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాకాయలు తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పీఎం ధన ధాన్య యోజన ప్రత్యక్ష ప్రసారం

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ విజ్ఞాన పరిషత్ న్యూఢిల్లీ వేదికగా పీఎం ధనధాన్య యోజన పథకాన్ని శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. పలు వ్యవసాయ పథకాలను దేశ రైతులకు అంకితం చేసే కార్యక్రమాన్ని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం చేయ నున్నట్లు రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

బ్యాంకు అభివృద్ధికి కృషిచేయండి

- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు అభివృద్ధికి కృషిచేయాలని చైర్మన్, డైరెక్టర్లకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మహేష్ కల్యాణ్ సదన్‌లో శుక్రవారం శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా ఖాదర్ బాషా నియమితులైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారిని చైర్మన్, డైరెక్టర్లు గజమాలతో ఘనంగా సత్కరించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఖాదర్‌బాషా మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన టీడీపీ అధిష్టానానికి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, గాలి చలపతినాయుడు, షాకీరాలీ, ధనంజయుల నాయుడు, కాసరం రమేష్, రాంబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఎం


ఇంటి స్థలాల భూమి వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెస్ట్‌వరత్తూరు గ్రామంలోని దళితుల స్వాధీనంలో ఉన్న భూమికి ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో భూమి దగ్గర శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా దళితులు ఇంటి స్థలాలు కోసం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఉన్నారన్నారు. అయితే కొందరు గ్రామస్తులు ఒక పథకం ప్రకారం ఆ భూమిలో శ్మశానం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణం ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపాలు, సుబ్బయ్య, శవకరయ్య, బాబు, గురవయ్య, నాగూర్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరత్నమ్మ శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు. నెల రోజులు పాటు ఎంపీడీవో శిక్షణకు వెళ్లారు. దీంతో కార్యాలయంలో పనిచేసే ఏవో మోతి ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. శిక్షణను ముగించుకుని వెంకటరత్నమ్మ తిరిగి బాధ్యతలు చేపట్టారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆయుధ పూజ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఆయుధ పూజను తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీ రమేష్, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ల ఏర్పాటు



కేవీబీపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండల కేంద్రం దళిత వాడలో ఎన్నో ఏళ్లగా ఉన్న తాగునీటి సమస్యకు ఎంపీ నిధులతో శాశ్వత పరిష్కారం లభించిందని కార్యదర్శి అంకయ్య చెప్పారు. ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీలోనే పైపులైను ఏర్పాటు చేసి ఉండడంతో దానిని తొలగించి కొత్త పైపులైను ఏర్పాటు చేసి కొత్తడ్రైనేజీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీంతో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యల తీరనున్నాయని వివరించారు.

ఎస్టీ మహిళపై తహసీల్దార్ దురుసు ప్రవర్తన దారుణం


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న యానాది సంఘం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన యానాది మహిళ మంగమ్మపై తహసీల్దార్ శ్రీదేవి దురుసు ప్రవర్తన దారుణమని యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జునరావు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనమనంబేడు రెవెన్యూలోని సర్వే నెంబరు 269 -1లో భూసమస్యపై జిల్లా యానాది సంఘం నాయకులతో శుక్రవారం కలసి వెళ్లిన యానాది మహిళ వృద్ధురాలైన మంగమ్మను తహసీల్దార్ తీవ్ర పదజాలంతో దూషించడం సరికాదన్నారు. తహసీల్దార్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యానాది సంఘం చైర్మన్ అత్తూరు చెంగల్‌రాయులు, మాజీ డీవీఎంసీ మెంబర్ అడివయ్య, కల్పన, శీనయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటూరు సహకార సంఘం చైర్మన్‌కు సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన వేంపల్లి భాస్కర్‌యాదవ్‌ను మండల టీడీపీ నాయకులు గాజులపెళ్లూరు గ్రామంలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయీబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటాచలం, నాయకులు చెంచు రామనాయుడు, శేషయ్య, సురేష్, శ్రీనివాసులు, రవి, శశి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్థశి పూజలు


హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక స్వామి ఆలయం వద్ద సంకట చతుర్థశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు సంకట చతుర్థశి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అంజి అంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన పూజలు నిర్వహించి గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

'రైతులకు రుణాలిచ్చి ఆదుకుంటాం'


రుణాలను అందిస్తున్న నందకిషోర్ రెడ్డి

వరదయ్యపాళెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పంట రుణాలు ఇచ్చి ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సింగిల్ విండో చైర్మన్ నందకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కదూరు సొసైటీ బ్యాంకు ద్వారా మండలంలోని పలు పురు రైతులకు పంట రుణాలను నందకిషోర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సహకార సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అండగా నిలుస్తోందన్నారు.

'ఏనుగుల దాడుల నుంచి రక్షణ కల్పిస్తాం'


రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏనుగుల దాడి నుంచి రక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మామండూరు గ్రామంలో ఇటీవల ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులను శుక్రవారం అందించారు. మొత్తం 16 మంది రైతులకు రూ.2.25లక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగుల దాడి వల్ల మామిడి రైతులు నష్టపోయిన విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారని తెలిపారు. ఆ మేరకు పరిహారం విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అటవీ రేంజ్ ఎఫ్ఆర్‌వో సుదర్శన్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బరాయుడు ఆచారి, వీఏఎస్ చైర్మన్ కుమార స్వామి, టీడీపీ నాయకులు విశ్వనాథ్‌యాదవ్, మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, నాథమునిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి: సీపీఎం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సత్యవేడు, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): వరదయ్యపాళెం మండలం కురింజలంలోని భారత్ షూ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని సత్యవేడు సీపీఎం కార్యదర్శి రమేష్ కోరారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పరిశ్రమ వద్దకు చేరుకుని కార్మికులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నపళంగా లాకౌట్ ప్రకటించి కార్మికుల కడుపు కొట్టడం తగదన్నారు. జిల్లా కార్మికశాఖ అధికారులు స్పందించి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణపై ఉద్యమం చేపట్టనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదే శాలతో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కోగిలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.